నాసిరకం గుడ్లు సరఫరా చేస్తే కఠిన చర్యలు

- అంగన్‌వాడీ కేంద్రాల్లో నిరంతర తనిఖీలు
- నాసిరకం సరుకులొస్తే టీచర్లు తీసుకోవద్దు
- మహిళా శిశుసంక్షేమ శాఖ సమీక్షలో మంత్రి సీతక్క

సమీక్షలో మాట్లాడుతున్న సీతక్క

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

కొన్ని అంగన్‌వాడీ కేంద్రాల్లో నాణ్యత లేని గుడ్లు పంపిణీ కావడంపై పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి మహిళా, శిశుసంక్షేమ శాఖ మంత్రి డాక్టర్ ధనసరి అనసూయ (సీతక్క) సీరియస్ అయ్యారు. దానిపై సమగ్ర నివేదిక ఇవ్వాలని అధికారులను ఆదేశించారు. కాంట్రాక్టర్లు నాసిరకం గుడ్లు సరఫరా చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో నాణ్యత లేని గుడ్లను పంపిణీ చేస్తే చిన్నారులు, గర్భిణులు, బాలింతలు అనారోగ్యానికి గురయ్యే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. వారికి నాణ్యమైన భోజనం అందించేలా చర్యలు చేపట్టాలని సూచించారు. సోమవారం హైదరాబాద్‌లోని డాక్టర్ బిఆర్ అంబేద్కర్ తెలంగాణ రాష్ట్ర సచివాలయంలో మహిళా, శిశు సంక్షేమ శాఖపై ఆమె సమీక్ష నిర్వహించారు. కాంట్రాక్టర్లు నాసిరకం గుడ్లు, వస్తువులు సరఫరా చేస్తే టీచర్లు తిరస్కరించాలని సూచించారు. లేదంటే సంబంధిత కేంద్రాల టీచర్లు, హెల్పర్లే బాధ్యత వహించాల్సి వస్తుందని హెచ్చరించారు. సరుకుల నాణ్యతను నిరంతరం పర్యవేక్షించేలా సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించుకోవాలనీ, ఎప్పటికప్పుడు నివేదికలు ఇవ్వాలని ఆదేశించారు. అంగన్‌వాడీ కేంద్రాలకు వస్తువుల సరఫరా చేసే కాంట్రాక్టులను గత ప్రభుత్వం రెండేండ్లకు పొడిగించడంతో కొందరు కాంట్రాక్టర్లు ఇష్టానుసారంగా వ్యవహరిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. అలా చేసేవారిని ఉపేక్షించబోమన్నారు. వస్తువుల క్వాలిటీని చెక్ చేసేందుకు జిల్లాల్లో ఫ్లయింగ్ స్క్వాడ్ బృందాలను ఏర్పాటు చేయాలని అధికారులను ఆదేశించారు. కేంద్రాల్లో అందుతున్న సేవలపై థర్డ్ పార్టీతో అధ్యయనం చేయించి లోపాలుంటే నవరిస్తామన్నారు. టెండర్ల ప్రక్రియలో పారదర్శకతను పెంచే దిశలో మరికొన్ని ప్రభుత్వ శాఖల సహకారం తీసుకుంటామని చెప్పారు. సమీక్షలో మహిళా శిశు సంక్షేమ శాఖ ముఖ్య కార్యదర్శి వాకాటి కరుణ, మహిళా సంక్షేమ శాఖ కమిషనర్ కాంతి వెస్లీతో పాటు సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

సెర్ప్ పై సీతక్క సమీక్ష

గ్రామీణ పేదరిక నిర్మూలన సంస్థ(సెర్ప్)పై మంత్రి సీతక్క సచివాలయంలో సోమవారం సమీక్షించారు. పంచాయతీరాజ్ గ్రామీణాభివృద్ధి శాఖ కార్యదర్శి లోకేష్ కుమార్, సెర్ప్ సిఇఒ దివ్య దేవరాజన్‌తో పాటు పలువురు అధికారులు పాల్గొన్నారు. సెర్ప్ ద్వారా అమలవుతున్న పథకాలు, బడ్జెట్ ప్రతిపాదనలను మంత్రి అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వం మ్యాచింగ్ గ్రాంట్లు ఇవ్వకపోవడం వల్ల చాలా వరకు కేంద్ర నిధులను వాడుకోలేక పోయామని అధికారులు మంత్రి దృష్టికి తీసుకొచ్చారు. పథకాల వారీగా పెండింగ్ మ్యాచింగ్ గ్రాంట్ల వివరాల జాబితాను సమర్పించాలని అధికారులను సీతక్క ఆదేశించారు. కేంద్ర నిధులను వినియోగించుకునే విధంగా యాక్షన్ ప్లాన్ సిద్ధం చేయాలని సూచించారు. సామాజిక పెన్షన్ల కోసం గత ప్రభుత్వం పెండింగ్‌లో ఉంచిన దరఖాస్తులు, తమ ప్రభుత్వానికి అందిన దరఖాస్తులపై ఆరా తీశారు. అర్హుల జాబితాను సిద్ధం చేయాలని అధికారులకు సూచించారు. అభయ హస్తం వంటి పథకాలను అమలు చేయకుండా వందల కోట్ల రూపాయల మహిళల పొదుపు సొమ్మును గత ప్రభుత్వం పక్కదారి పట్టించిందన్నారు. ఆ నిధుల వివరాలను ప్రభుత్వానికి నివేదించాలని అధికారులకు సూచించారు.

ఉచిత మెడికల్ క్యాంప్ ఏర్పాటు

ప్రజాశక్తి - హైదరాబాద్

కర్నాటక బ్యాంక్, బజాజ్ అలయన్జ్ జనరల్ ఇన్సూరెన్స్ సంయుక్తంగా ఉచిత మెడికల్ క్యాంప్‌ను ఏర్పాటు చేశాయి. ఆదివారం జూబ్లీహిల్స్‌లో ఏర్పాటు చేసిన ఈ క్యాంప్‌ను ఉషా ఎన్‌క్లేవ్ అసోసియేషన్ అధ్యక్షులు శర్మ లాంఛనంగా ప్రారంభించారు. వివిధ హాస్పిటళ్లకు చెందిన వైద్యులు 70 మందికి పలు వైద్య పరీక్షలు చేశారు. తగిన సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో కర్నాటక బ్యాంక్ చీఫ్ మేనేజర్ బసిరెడ్డి, సీనియర్ మేనేజర్ రాంమోహన్ రెడ్డి, బజాజ్ అలయన్జ్ ప్రతినిధులు శ్రీకాంత్, దేవీ ప్రసాద్ పాల్గొన్నారు. ఈ కార్యక్రమానికి మద్దతునిచ్చిన రీజినల్ హెడ్ శేషాద్రికి ధన్యవాదాలు తెలిపారు.

మతోన్మాద దాడులకు వ్యతిరేకంగా
17 నుంచి 25 వరకు రాష్ట్ర వ్యాప్త సదస్సులు

- వామపక్ష పార్టీల పిలుపు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

రాష్ట్రంలో మైనార్టీల మీద బిజెపి, ఆర్‌ఎస్‌ఎస్ శక్తులు చేస్తున్న మతోన్మాద దాడులకు వ్యతిరేకంగా ఈనెల 17 నుంచి 25 వరకు రాష్ట్ర వ్యాప్తంగా సదస్సుకు వామపక్ష పార్టీలు పిలుపునిచ్చాయి. ఈ మేరకు సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు ఎస్ వీరయ్య, డీజీ నరసింహారావు, సిపిఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు ఈటి నరసింహా, సిపిఐ(ఎంఎల్) మాస్‌లైన్ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు రమ, రామచందర్, సిపిఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు కె గోవర్ధన్, సిపిఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ నాయకులు ఎం శ్రీనివాస్, ఆకుల పాపయ్య, ఎంసిపిఐ(యూ) రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు వనం సుధాకర్, ఎస్‌యూసీఐ(సీ) నాయకులు ధర్మతేజ, ఆరెస్పీ రాష్ట్ర కార్యదర్శి జానకి రాములు సోమవారం ఒక ప్రకటన విడుదల చేశారు. రాష్ట్రంలో ఓట్లు-సీట్లు పెరిగిన నేపథ్యంలో బిజెపి, ఆర్‌ఎస్‌ఎస్‌లకు సంబంధించిన సంస్థలు మైనార్టీల మీద దాడులను మరింత విస్తృతంగా చేస్తున్నాయని విమర్శించారు. మెదక్ పట్టణంలో నాలుగు గంటలపాటు ఆస్తుల విధ్వంసం చేయడంతోపాటు, బక్రీద్ సందర్భంగా ఆదిలాబాద్, మేడ్చల్, రంగారెడ్డి, జనగామ తదితర ప్రాంతాల్లో గోరక్షణ పేరుతో దాడులు చేశాయని తెలిపారు. ప్రజల్లో మతపరమైన భావోద్వేగాలు, ఘర్షణలను పెంచే వాతావరణం సృష్టిస్తున్నాయని పేర్కొన్నారు. రాజకీయ ప్రయోజనాల కోసం శాంతియుతంగా ఉన్న వాతావరణాన్ని కలుషితం చేస్తున్నాయని విమర్శించారు. ప్రజా సమస్యల నుంచి దృష్టి మరల్చుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. కేంద్రంలో బిజెపి మూడోసారి అధికారంలోకి రావడం, మోడీ మళ్లీ ప్రధాని కావడంతో దేశవ్యాప్తంగా ఇలాంటి ఘర్షణలను సంఘ్‌పరివార్ శక్తులు సృష్టిస్తున్నాయని తెలిపారు. తెలంగాణలోనే కాకుండా ఉత్తరప్రదేశ్, మధ్యప్రదేశ్, బీహార్, ఛత్తీస్‌ఘఢ్, గుజరాత్, హిమాచల్‌ప్రదేశ్, ఢిల్లీ తదితర రాష్ట్రాల్లో మైనార్టీల మీద దాడులకు పాల్పడుతున్నాయని విమర్శించారు. ఈ క్రమంలో సమస్యల పరిష్కారం కోసం పేదలు ఐక్యంగా పోరాడాల్సిన సమయం ఆసన్నమైందని పేర్కొన్నారు. ఇందుకు భిన్నంగా పేదల మధ్య మతంపేరుతో చిచ్చుపెట్టడం ప్రజా ప్రయోజనాలకు నష్టమని తెలిపారు. అందుకే రాష్ట్రంలో మత సామరస్యాన్ని కాపాడుకోవాలని కోరారు. రాజకీయ ప్రయోజనాల కోసం మతాన్ని వాడుకునే ప్రయత్నాలను వ్యతిరేకించాలని పేర్కొన్నారు. ఇందుకోసం తెలంగాణ ప్రజానీకాన్ని చైతన్యపరిచేందుకు వామపక్ష పార్టీలు రాష్ట్రవ్యాప్తంగాక్యాంపెయిన్ చేయాలని నిర్ణయించాయని తెలిపారు. అందులో భాగంగానే ఈనెల 17 నుంచి 25 వరకుఅన్నిజిల్లాకేంద్రాల్లో సదస్సులు పేర్కొన్నారు.

భూ వివాదాల్లో రాజకీయ జోక్యం వల్లే రైతుల ఆత్మహత్యలు

- రెవెన్యూ, పోలీసు వ్యవస్థ రాజకీయఒత్తిళ్లకి లొంగొద్దు
- రైతు సంఘం నాయకులు నున్నా నాగేశ్వరరావు, బొంతు రాంబాబు

సమావేశంలో మాట్లాడుతున్న రైతు సంఘం నాయకులు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

జిల్లాలోని భూ వివాదాల్లో రాజకీయ జోక్యంతో రైతుల ఆత్మహత్యలు జరుగుతున్నాయని, రెవెన్యూ, పోలీసు వ్యవస్థ రాజకీయ ఒత్తిళ్లకి తలవొంచద్దని తెలంగాణ రైతు సంఘం రాష్ట్ర నాయకులు నున్నా నాగేశ్వరరావు, ఖమ్మం జిల్లా ప్రధాన కార్యదర్శి బొంతు రాంబాబు అన్నారు. సోమవారం ఖమ్మం జిల్లా కేంద్రంలోని సుందరయ్య భవన్‌లో తెలంగాణ రైతు సంఘం జిల్లా అధ్యక్షులు మాదినేని రమేష్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో వారు మాట్లాడారు. రాజకీయ జోక్యంతో భూ సమస్యలు జటిలమవుతూ పరిష్కారం కాని పరిస్థితి నెలకొందని అన్నారు. రాజకీయ అండ, ధన, కండ బలం కలిగిన వారిని, భూ కబ్జాదారులను ఎదురించే శక్తి లేక రైతులు ఆత్మహత్యలకు పాల్పడే పరిస్థితి జిల్లాలో పెరిగిందని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రజాప్రతినిధులు, అధికారులు తమ దృష్టికి వచ్చిన భూ సమస్యలపై కేవలం ఒకవైపే కాకుండా రెండు వైపులా ఉన్న వాస్తవ పరిస్థితులను సమగ్రంగా పరిశీలించి పరిష్కారం కోసం కృషి చేయాలని కోరారు. సీతారామ ప్రాజెక్టు ప్రధాన కాలువలు సత్వరమే పూర్తి చేయాల్సిన అవసరం ఉందని, అందుకు అవసరమైన నిధులు రాష్ట్ర ప్రభుత్వం పూర్తి స్థాయి బడ్జెట్‌లో కేటాయించాలని డిమాండ్ చేశారు. సాగుదారులకు తక్షణమే రైతు భరోసా విడుదల చేయాలని, ఎన్నికల మేనిఫెస్టో ప్రకారం రాష్ట్ర ప్రభుత్వం కౌలు రైతులకు భరోసా అందించాలని, గుర్తింపుకార్డుల జారీ ప్రక్రియ చేపట్టాలన్నారు. 2018 డిసెంబర్ 12 కంటే ముందే బ్యాంకులో వ్యవసాయ రుణాలు తీసుకున్న రైతులకు, పహణి ద్వారా బ్యాంకుల్లో అప్పు తీసుకున్న రైతులకు రైతు రుణమాఫీ వర్తింపు చేయాలని డిమాండ్ చేశారు. సమావేశంలో తెలంగాణ రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షులు ఎస్‌కె మీరా, సహాయ కార్యదర్శులు చింతనిప్పు చలపతిరావు, బిక్కసాని గంగాధర్ తదితరులు పాల్గొన్నారు.

IN THE HON'BLE COURT OF THE I ADDL. SENIOR CIVIL JUDGE AT: VISAKHAPATNAM
I.A. 1185/2023 in O.S. 335/2023 and O.S. 335/2023

Between:
Sri Bora Appa Rao . . . Petitioner & Plaintiff
And:
Smt. Suggu Lakshmi Reddy & 4 others ...Respondents & Defendants
To,
5th Respondent & 5th Defendant:
Smt. Kimili Sridevi,
W/o. Sri K.N. Srinivasa Reddy,
D/o. Late B. Venkata Rao, Hindu,
aged 45 years, R/at Flat No. E-205,
Shree Keerthi Towers,
Near Lalapet, Bridge, Tharnaka,
Secundrabad-500 007. Telangana (State).

NOTICE

Please take notice that the above suit is filed for the Preliminary Decree for partition of the suit schedule properties into 4 equal shares and allots one such share to the plaintiff and allot 3 such shares to the defendants i.e. 1st& 2nd defendant allot-2 shares i.e. Each one and remaining One such share allot to defendants 3 to 5. One by converting the Joint possession into separate possession and other reliefs.

The above interim petition is filed for the relief to grant ad-interim temporary injunction restraining the respondents/ defendants and their men, agents and who ever acts on their behalf Not to change the physical features by transferring the schedule property in to the third parties till disposal of the suit. Both the above Suit and I.A. is posted to **19-07-2024** for your appearance on which date, you are required to appear before the above Hon'ble Court either in person or through your Advocate at **10:30 A.M**., failing which you will be set-exparte and the matter will be decided in your absence on merits.

(By Order)
P.V. RAMA RAO, Advocate,
2-3, Bajee Jn., Gopalapatnam,
Visakhaptanam. Cell: 9848353549.

ఆరోగ్య పరీక్షల పేరిట దోపిడీ

- భవన నిర్మాణ కార్మికుల వెల్ఫేర్ బోర్డు నిధులు పక్కదారి
- ప్రయివేటు కంపెనీకి దొడ్డిదారిన కట్టబెట్టిన కేంద్ర, బిఆర్‌ఎస్ ప్రభుత్వాలు
- సిపిఎం హైదరాబాద్ సెంట్రల్ సిటీ కార్యదర్శి ఎం శ్రీనివాస్

మీడియాతో మాట్లాడుతున్న ఎం శ్రీనివాస్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

భవన నిర్మాణ కార్మికులకు వైద్య పరీక్షల పేరిట పెద్ద ఎత్తున దోపిడీ జరుగుతున్నదని, వారి వెల్ఫేర్ బోర్డు నుంచి వందల కోట్ల రూపాయల నిధులు పక్కదోవ పడుతున్నాయని సిపిఎం హైదరాబాద్ సెంట్రల్ సిటీ కార్యదర్శి ఎం శ్రీనివాస్ చెప్పారు. వైద్యపరీక్షల పేరుతో జరుగుతున్న దోపిడీపై సమగ్ర విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు. సోమవారం హైదరాబాద్‌లోని గోల్కొండ క్రాస్‌రోడ్డులోని సిపిఎం కార్యాలయంలో ఆయన మీడియాతో మాట్లాడారు. రాష్ట్రంలోని భవన నిర్మాణ కార్మికులకు ఆరోగ్య పరీక్షలు నిర్వహించేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కలిసి 2022లో సిఎస్‌సి హెల్త్‌కేర్ వెల్‌నెస్ సర్వీసెస్ లిమిటెడ్ అనే సంస్థకు కాంట్రాక్టు ఇచ్చాయని తెలిపారు. సంస్థ స్థాపించి ఏడాది గడవకముందే రాష్ట్రమంతటా టెస్టులు చేసే అవకాశం ఆ సంస్థకు ఎలా ఇచ్చారు? అంతే ధరలో అపోలో, యశోద, విజయా డయాగ్నస్టిక్ సెంటర్‌లో టెస్టులు చేస్తుంటే కొత్త సంస్థకు ఇవ్వడమేంటి? టెండర్లు వేయకుండా నేరుగా ఆ సంస్థకు ఎందుకిచ్చారు? అంటూ ప్రశ్నల వర్షం కురిపించారు. ఇక్కడే అవినీతికి బీజం పడిందని తెలిపారు. రాష్ట్రంలో 14 లక్షల మంది నిర్మాణ రంగ కార్మికులుండగా అందులో ఇప్పటికే 11 లక్షల మందికి పరీక్షలు నిర్వహించారన్నారు. ఇప్పుడు కుటుంబ సభ్యులకూ పరీక్షలు చేయించాలని, చేయించుకోకపోతే కార్డులు రద్దవుతాయని కార్మికులను సిఎస్‌సి సంస్థ బెదిరించడమేంటని ప్రశ్నించారు. వందల సంఖ్యలో ఆరోగ్య క్యాంపులు నిర్వహిస్తున్నట్టు, కార్మికులకు వైద్య పరీక్షలు చేస్తున్నట్టు లెక్కలు చూపడం దారుణమన్నారు. బ్లడ్ శాంపిల్స్ తీసుకుని గుండె పరీక్షలు కూడా చేశామని రిపోర్టులు ఎలా ఇస్తారని నిలదీశారు. రిపోర్టులకు సంబంధించిన పలు ఆధారాలను కూడా మీడియాకు చూపెట్టారు. ఎవరైనా కార్మికుడు అనారోగ్యం పాలైతే ఆ రోగానికి సంబంధించిన టెస్టులు చేయిస్తే బాగుంటుందిగానీ అవసరం లేకున్నా ఈ పరీక్షలు ఏంటని ప్రశ్నించారు. బిఒసిడబ్ల్యు గతేడాది ఆరోగ్య పరీక్షల కోసం రూ.124 ఖర్చుచేసిందని, ఈ ఏడాది కూడా భారీ ఖర్చుగా పెడుతున్నారని గణాంకాలతో వివరించారు. కార్మిక శాఖ అధికారులు కాంట్రాక్టర్‌తో కుమ్మక్కయి నిధులను పక్కదోవ పట్టిస్తున్నారని విమర్శించారు. నిర్మాణ కార్మికులకు వైద్య పరీక్షల పేరిట జరుగుతున్న దోపిడీకి అడ్డుకట్ట వేయాలని, సిఎస్‌సి హెల్త్‌కేర్‌తో కుదుర్చుకున్న ఒప్పందాన్ని రద్దు చేయాలని డిమాండ్ చేశారు. కార్మికులకు ఆరోగ్య పరీక్షలు అవసరమైతే ఉచితంగా నిర్వహించేలా ప్రభుత్వమే చర్యలు తీసుకోవాలని కోరారు. సిఎస్‌సితో ఒప్పందంపై సమగ్ర విచారణ జరిపించాలని, బాధ్యులైన అధికారులు, రాజకీయ నాయకులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు ఎం.శ్రీనివాసరావు, మహేందర్, భవన, ఇతర నిర్మాణ రంగ కార్మికుల యూనియన్ (సిఐటియు అనుబంధం) జిల్లా కార్యదర్శి బి మధు, తదితరులు పాల్గొన్నారు.



వైఎస్‌ఆర్‌కు సిఎం ఘననివాళి

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

దివంగత సిఎం వైఎస్ రాజశేఖర్ రెడ్డి విగ్రహానికి తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, డిప్యూటీ సిఎం భట్టి విక్రమార్క, మంత్రి పొన్నం ప్రభాకర్ నివాళులర్పించారు. వైఎస్‌ఆర్ 75వ జయంతి సందర్భంగా సోమవారం బంజారాహిల్స్‌లోని సిటీ సెంటర్ వద్దనున్న ఆయన విగ్రహానికి పూలమాలలు వేశారు. ఫొటో ఎగ్జిబిషన్‌ను సందర్శించారు. అనంతరం గాంధీభవన్‌లో జరిగిన కార్యక్రమంలో సిఎం పాల్గొన్నారు. ఈ సందర్భంగా రేవంత్ మాట్లాడుతూ.. "వైఎస్‌ఆర్ పాదయాత్రతో గతంలో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చింది. ఇటీవల రాహుల్ గాంధీ పాదయాత్రతో పలు రాష్ట్రాల్లో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చింది. కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ ప్రధాన ప్రతిపక్షంగా ఉంది. రాహుల్‌ను ప్రధాని చేయాలని వైఎస్‌ఆర్ సంకల్పించారు. రాహుల్‌ను ప్రధానిని చేస్తేనే పేదలకు సంక్షేమం అందుతుంది. వైఎస్‌ఆర్ స్ఫూర్తితోనే రాహుల్‌ను ప్రధానిని చేసే విధంగా మనం ముందుకెళ్లాలి. వైఎస్‌ఆర్ ఆశయం అంటే సంక్షేమం, అభివృద్ధి. మూసీ ప్రక్షాళన చేయాలనే ఆలోచన వైఎస్‌ఆర్ స్ఫూర్తితోనే ప్రభుత్వం చేపట్టింది. రాష్ట్రంలో కాంగ్రెస్ గెలుపునకు కృషి చేసిన వారికి ఛైర్మన్ పదవులు ఇచ్చాం. ప్రతి కార్యకర్తకు గుర్తింపు ఉంటుంది. రాహుల్ గాంధీ నాయకత్వానికి వ్యతిరేకంగా వెళ్లేవారు వైఎస్ వారసులు కాదు. పిసిసి అధ్యక్షుడిగా మూడు సంవత్సరాలు ఎన్నో ఒడిదొడుకులను ఎదుర్కొన్నా" అని రేవంత్ తెలిపారు. మహాత్మా జ్యోతిబా పూలే ప్రజాభవన్‌లో వైఎస్ రాజశేఖర్‌రెడ్డి 75వ జయంతిని సోమవారం నిర్వహించారు. ఆయన చిత్రపటానికి మంత్రి సీతక్క పూలమాల వేసి నివాళులు అర్పించారు.

నోటీసు
మహారాజశ్రీ అడిషనల్ సివిల్ జడ్జి (సీనియర్ డివిజన్) వారి కోర్ట్, నరసరావుపేట
I.A No. 592/2023 IN O.S No. 168/2004

1) అయినవోలు నరసింహారావు మరియు ఇతరులు ...... పిటీషనర్లు / వాదులు
1) చందనం సాంబశివరావు మరియు ఇతరులు ..... రెస్పాండెంట్లు/ ప్రతివాదులు
(R5) చందనం బాల సుమన మల్లిక,
(భర్త) Dr. మల్లికార్జునరావు
నివాసము, డోర్ నెం. 2-2-18/4/40, బాగ్ అంబర్ పేట, హైదరాబాద్, తెలంగాణా రాష్ట్రము.

పై నెంబర్ I.A No. 592/2023 లో, మీకు నోటీసులు పంపగా, మీరు తీసుకోనందున, మీకు నోటీసు నిమిత్తమై, శ్రీ కోర్ట్ వారు పేపర్ ప్రకటన ద్వారా నోటీసులు పంపుటకు ఆర్డర్ వేసియున్నారు. ది.30-07-2024 వ తేదికి వాయిదా అయివున్నది. కావున ది. 30-07-2024వ తేదిన, ఉదయం గం 10.30 నిమిషములకు శ్రీ కోర్ట్ వారి యెదుట, స్వయముగా గాని లేదా వకీలు ద్వారాగాని హాజరు అయ్యి, మీకు ఆక్షేపణలు వున్నయెడల తెలుపుకోవలసి యున్నది. లేనియెడల మీ పరోక్షమందు చట్టప్రకారము తీర్మానించబడునని, ఇందుమూలముగా మీకు తెలియ జేయడమయినది.

వాయిదా తేది : 30-07-2024
శ్రీ డి.వి.డి.నాగేశ్వరరావు,
పిటీషనర్లు తరఫు న్యాయవాది
సెల్ నెం.9849122871.

25 వేల టీచర్ పోస్టులను పెంచాలి

- డిఎస్‌సికి మూడు నెలలు సమయం కేటాయించాలి
- బిసి సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షులు ఆర్.కృష్ణయ్య
- విద్యాశాఖ కమిషనర్ కార్యాలయం ముట్టడి
- పలువురు అరెస్ట్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

డిఎస్‌సి కింద 25 వేల టీచర్ పోస్టులను పెంచి భర్తీ చేయాలని, డిఎస్‌సికి మూడు నెలల సమయం కేటాయించాలని బిసి సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షులు ఆర్. కృష్ణయ్య డిమాండ్ చేశారు. వివిధ జిల్లాల నుంచి వచ్చిన నిరుద్యోగులు, జెఎసి నేతలు సోమవారం తెలంగాణ నిరుద్యోగ జెఎసి ఛైర్మన్, బిసి యువజన సంఘం రాష్ట్ర అధ్యక్షులు నీల వెంకటేష్ ఆధ్వర్యంలో హైదరాబాద్ సైఫాబాద్‌లోని విద్యాశాఖ కమిషనర్ కార్యాలయాన్ని ముట్టడించారు. ఈ క్రమంలో పోలీసులకు నిరుద్యోగుల మధ్య తీవ్ర వాగ్వాదం, ఉద్రిక్తత జరిగింది. అనంతరం పలువురు జెఎసి నేతలు, నిరుద్యోగులను అరెస్టు చేసి పోలీస్ స్టేషన్లకు తరలించారు.

ఈ సందర్భంగా ఆర్. కృష్ణయ్య మాట్లాడుతూ.. రాష్ట్రంలో బిఇడి చేసిన నాలుగు లక్షల మందికిపైగా నిరుద్యోగులు ఉన్నారని చెప్పారు. ప్రభుత్వ పాఠశాలల్లో పిఆర్‌సి రిపోర్టు ప్రకారం రిటైర్మెంట్ వల్ల ఏర్పడిన 25 వేల టీచర్ పోస్టులను భర్తీ చేయాలని, ఎయిడెడ్ పాఠశాలల్లో ఖాళీగా ఉన్న 4,900 పోస్టులు భర్తీ చేయాలని కోరారు. 25 ఏళ్లుగా ఎయిడెడ్ పాఠశాలల్లో టీచర్ పోస్టులను భర్తీ చేయడం లేదని, 90 శాతం ఖాళీలు ఏండ్ల తరబడి ఉంటున్నాయని అన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో ఖాళీగా ఉన్న 10 వేల పిఇటి పోస్టులను భర్తీ చేయాలని, ప్రభుత్వ జీఓ ప్రకారం ప్రతి పాఠశాలకూ ఒక పిఇటి టీచర్ ఉండాలని అన్నారు. 20 ఏండ్లుగా ఖాళీగా ఉన్న ఐదు వేల ఆర్ట్-క్రాఫ్ట్, డ్రాయింగ్ టీచర్ పోస్టులు భర్తీ చేయాలని కోరారు. అలాగే, నాలుగు వేల మంది కంప్యూటర్ టీచర్లను నియమించాలని, ప్రతి పాఠశాలకూ ఒక జూనియర్ అసిస్టెంట్ ఉండాలని అన్నారు. ప్రభుత్వం ద్వారా వచ్చే సర్క్యులర్స్, ఇతర కరస్పాండెంటు చేయడానికి, విద్యార్థులకు సర్టిఫికేట్లు ఇవ్వడానికి, విద్యార్థుల హాజరు తదితర వివరాలు ఎప్పటికప్పుడూ తల్లిదండ్రులకు తెలుపడానికి ప్రతి పాఠశాలకు జూనియర్ అసిస్టెంట్ పోస్టు అవసరమని చెప్పారు. పాఠశాలల్లో ఖాళీగా ఉన్న 15 వేల అటెండర్, స్వీపర్ పోస్టులనూ వెంటనే భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. అన్ని కేటగిరీల పోస్టులను భర్తీ చేసి పాఠశాల విద్యా వ్యవస్థను పటిష్టం చేయాలని ప్రభుత్వాన్ని కోరారు. అప్పటి వరకు రాష్ట్ర వ్యాప్తంగా వేలాది మంది నిరుద్యోగ యువతతో నిరసన, ఆందోళన కార్యక్రమాలు చేపడతామని ప్రభుత్వాన్ని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర బిసి యువజన సంఘం నాయకులు పగిళ్ళ సతీష్, నిఖిల్, రాందేవ్, ప్రీతం, శివరాం, శ్రీనివాస్, స్వాతి, శశి, నిరుద్యోగులు పాల్గొన్నారు.

రేపు డి సెట్ పరీక్ష

- 17,655 మంది దరఖాస్తు
- 39 కేంద్రాల్లో ఆన్‌లైన్‌లో నిర్వహణ
- ఏర్పాట్లు పూర్తి చేసిన విద్యాశాఖ

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

రాష్ట్రంలోడిప్లొమా ఇన్ ఎలిమెంటరీ ఎడ్యుకేషన్ (డీఈఐఈడీ), డిప్లొమా ఇన్ ప్రీస్కూల్ ఎడ్యుకేషన్ (డిపిఎస్ఇ) కోర్సుల్లో 2024-26 బ్యాచ్ ప్రవేశాల కోసం డీసెట్-2024 ప్రవేశ పరీక్ష బుధవారం ఆన్‌లైన్‌లో జరగనుంది. ఈ మేరకు డీసెట్ కన్వీనర్ ఎస్ శ్రీనివాసాచారి సోమవారం ఒక ప్రకటన విడుదల చేశారు. రాష్ట్రవ్యాప్తంగా 17,655 మంది అభ్యర్థులు దరఖాస్తు చేశారని వివరించారు. ఈ పరీక్ష నిర్వహణ కోసం రాష్ట్రవ్యాప్తంగా 39 పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేశామని తెలిపారు. బుధవారం రెండు విడతల్లో రాతపరీక్షలు జరుగుతాయని పేర్కొన్నారు. మొదటి విడతలో తెలుగు మాధ్యమం అభ్యర్థులకు ఉదయం పది నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు పరీక్ష నిర్వహిస్తామని తెలిపారు. ఉదయం 8.30 గంటల నుంచే పరీక్షా కేంద్రాల్లోకి అభ్యర్థులను అనుమతిస్తామని పేర్కొన్నారు. ఉదయం 9.45 గంటల వరకే అభ్యర్థులను అనుమతిస్తామనీ, ఆ తర్వాత గేట్లు మూసేస్తామని తెలిపారు. రెండో విడతలో ఇంగ్లీష్, ఉర్దూ మాధ్యమం అభ్యర్థులకు మధ్యాహ్నం మూడు నుంచి ఐదు గంటల వరకు నిర్వహిస్తామని పేర్కొన్నారు. మధ్యాహ్నం 1.30గంటల నుంచే అభ్యర్థులను పరీక్షా కేంద్రాల్లోకి అనుమతిస్తామని వివరించారు. మధ్యాహ్నం 2.45 గంటల వరకే అభ్యర్థులను అనుమతిస్తామనీ, ఆ తర్వాత గేట్లు మూసేస్తామని తెలిపారు. అభ్యర్థులు హాల్‌టికెట్‌తోపాటు ఒరిజినల్ ఫొటో గుర్తింపు కార్డును వెంట తెచ్చుకోవాలని సూచించారు. ఇతర వివరాలకు http://deecet.cdse.telangana.gov.inవెబ్‌సైట్‌ను సంప్రదించాలని కోరారు.

దళిత ఎస్‌ఐ
ఆత్మహత్యపై సిట్టింగ్ జడ్జితో విచారణ

- కెవిపిఎస్ డిమాండ్
- ఖమ్మంలో నిరసన

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

పోలీసు శాఖలోనూ కుల వివక్ష వేధింపులు ఉండటం వల్లే దళిత ఎస్‌ఐ శ్రీరాముల శ్రీనివాస్ ఆత్మహత్య చేసుకున్నారని, ఈ ఘటనపై ముఖ్యమంత్రి స్పందించాలని, సిట్టింగ్ జడ్జితో న్యాయ విచారణ జరిపించాలని కెవిపిఎస్ ఖమ్మం జిల్లా ప్రధాన కార్యదర్శి నందిపాటి మనోహర్ డిమాండ్ చేశారు. సోమవారం ఖమ్మంలో కెవిపిఎస్ ఆధ్వర్యంలో ఎన్నెస్పీ క్యాంప్ రోడ్డుపైన నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అశ్వరావుపేట ఎస్‌ఐ శ్రీరాముల శ్రీనివాస్ 25 రోజుల కిందటనే తాను ఎదుర్కొన్న వివక్ష వేధింపులపై జిల్లా ఎస్పీకి లిఖితపూర్వకంగా ఫిర్యాదు చేసినా సరైన సమయంలో స్పందించకపోవడం వల్లే ఇంతటి దారుణం జరిగిందని అన్నారు. సిఐ జితేందర్‌రెడ్డి, కానిస్టేబుళ్లు కొందరు వేధించిన తీరువల్లే మనస్తాపానికి లోనై ఆత్మహత్య చేసుకున్నారని చెప్పారు. ఈ సంఘటనపై సిఎం రేవంత్‌రెడ్డి స్పందించి.. పోలీసు శాఖలో జరుగుతున్న కుల వివక్ష వేధింపులపై ప్రక్షాళన చేపట్టాలని డిమాండ్ చేశారు. రాష్ట్రంలో రోజురోజుకీ దళితులపైన దాడులు, దౌర్జన్యాలు పెరుగుతున్నాయని, ఎస్‌సి, ఎస్‌టి అట్రాసిటీ చట్టాన్ని పకడ్బందీగా అమలు చేయడంలో రాష్ట్ర పోలీసు ఉన్నతాధికారులు, ప్రభుత్వం నిర్లక్ష్యం ప్రదర్శిస్తున్నారని విమర్శించారు. ఈ ఘటనపై సిట్టింగ్ జడ్జితో సమగ్ర విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో కెవిపిఎస్ జిల్లా నాయకులు పాపిట్ల సత్యనారాయణ, పొన్నెకంటి సంగయ్య, మాచర్ల గోపాల్, నందిగామ కృష్ణ, పి.కృష్ణ, ఎం.పుల్లారావు పాల్గొన్నారు.

IN THE COURT OF THE MACT CUM XI ADDL, CHIEF JUDGE: CITY CIVIL COURT, AT HYDERABAD
OP.NO. 113 OF 2023

BETWEEN:
Sabhavath Sunitha and others ...Petitioners.
AND
R. Gouri Shankar & another. ...Respondents.
To,
R. Gouri Shankar S/o. R.Appa Rao, Age : Major Occ:Owner Cum driver of car bearing No.TS-08-HZ-1323, R/o:H.NO.16-3-21/693, Near Vasatnth Nagar Colony, Bhagath Sing Nagar, Kukatpally, Medchal, TS -500 072. ...Resopndent No.1

please take notice that the petitioners have filed the above O.P. against you No. 1 and other respondent for claiming compensation for the death of deceased Sabavath Ravi S/o Sabavath Basu in a road accident which was occurred on 27/11/2022 at 18:00 hours at near Rajapur Village and Mandal, Mahaboobnagar District. The said O.P is posted to 05.08.2024 at 10:30 AM for your appearance and counter. kindly make it convenient to be present on the said date before this Hon'ble Court by 10.30 AM in person or through your counsel, failing which the matter will be decided on your obsence.

Hence this notice
BY ORDER OF THE COURT
M. VIJAY REDDY
ADVOCATE
2-2-647/A/58, Saibabanagar, Shivam Raod, Bagh Amberpet, Hyderabad Ph: 7673904549 9330489999

తొమ్మిదేళ్లుగా ప్రయత్నం.. కనికరించని కేంద్రం

- ఏర్పాటు కాని మరమగ్గాల క్లస్టర్
- కేంద్రం నిర్ణయంపై నేతన్నల ఎదురుచూపు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

రాష్ట్రంలో మరమగ్గాల వస్త్రోత్పత్తిలో రాజన్న సిరిసిల్ల జిల్లాది ప్రథమ స్థానం. కానీ ఇక్కడి పరిశ్రమల్లో ఉత్పత్తి అవుతున్న వస్త్రం జాతీయ, అంతర్జాతీయ మార్కెట్‌లో పోటీ పడలేక పోతున్నది. దీనికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సహకారం చాలా అవసరం. దాని కోసం సిరిసిల్లలో సమగ్ర పవర్ లూమ్ క్లస్టర్ డెవలప్‌మెంట్ స్కీమ్ (సిపిసిడిఎస్) కింద మెగా పవర్ లూమ్ క్లస్టర్ ఏర్పాటు తొమ్మిదేండ్లుగా జరుగుతున్న ప్రయత్నాలు కొలిక్కి రావడం లేదు. గత ప్రభుత్వంలో అప్పటి రాష్ట్ర మంత్రి కెటిఆర్, కేంద్ర జౌళిశాఖ అప్పటి మంత్రి స్మృతి ఇరానీని కలిసి అనేకసార్లు విజ్ఞప్తి చేసినా ఫలితం లేకపోయింది.

రాష్ట్రవ్యాప్తంగా 35వేల మరమగ్గాలు ఉండగా వాటిలో 29వేలు రాజన్న సిరిసిల్ల జిల్లాలోనే ఉన్నాయి. వీటిపై గతంలో రోజుకు 13.20 లక్షల మీటర్ల పాలిస్టర్, 6.60 లక్షల మీటర్ల కాటన్ వస్త్రోత్పత్తి జరుగుతోంది. జిల్లా కేంద్రంలో వస్త్రోత్పత్తి పరిశ్రమల ద్వారా 80 శాతం మంది ప్రత్యక్షంగా, పరోక్షంగా ఉపాధి పొందుతున్నారు. దేశవ్యాప్తంగా వస్త్రోత్పత్తి రంగంలో వస్తున్న ఆధునికతను ఇక్కడి పరిశ్రమ వర్గాలు అందిపుచ్చుకోలేక పోతున్నాయనే విమర్శలు వినిపిస్తున్నాయి. స్థానికంగా మరమగ్గాల ఆధునికీకరణ, నైపుణ్యం, మౌలిక వసతుల కొరత అధికంగా ఉంది. ఈ సమస్యలతో దేశంలోని మిగతా ప్రాంతాల్లోని మరమగ్గాల పరిశ్రమతో ఇక్కడి పరిశ్రమ పోటీ పడలేక పోతుంది. ఫలితంగా జిల్లాలో ఉత్పత్తి అవుతున్న వస్త్రం జాతీయ, అంతర్జాతీయ స్థాయి మార్కెట్లలో గుర్తింపునకు నోచుకోవడం లేదు. సొంతంగా తయారుచేసి ఉత్పత్తులు బహిరంగ మార్కెట్‌లో ఇతర బ్రాండ్లతో పోటీ పడలేకపోతున్నాయి. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారిస్తే సిరిసిల్ల వస్త్ర పరిశ్రమ సంక్షోభం నుంచి బయటపడే అవకాశం ఉంది.

సిపిసిడిఎస్ ఏర్పాటు చేస్తే..

రాష్ట్రంలో చేనేత మరమగ్గాల కార్పొరేషన్లు వేరువేరుగా ఏర్పాటు చేశారు. సిపిసిడిఎస్ ఏర్పాటుకు గత ప్రభుత్వం రూ.993.65 కోట్ల అంచనా వ్యయంతో ప్రణాళికను రూపొందించింది. మొదటి విడత కేంద్రం వాటాగా రూ.49.84కోట్లు కేటాయించాలని అప్పటి మంత్రి కెటిఆర్ నాటి కేంద్ర జౌళిశాఖ మంత్రికి విజ్ఞప్తి చేశారు. జిల్లాలో మెగా పవర్‌లూమ్ క్లస్టర్‌ను ఏర్పాటు చేస్తే ఈ ప్రాంతంలో మరమగ్గాల పరిశ్రమపై ఆధారపడ్డ వేలాది కుటుంబాలకు శాశ్వత ప్రయోజనం కలుగుతుంది. మహారాష్ట్రలోని ఈరోడ్, బివండీ ప్రాంతాల్లో కేంద్రం 2009-10, 2012-14లో సిపిసిడిఎస్‌ను ఏర్పాటు చేసింది. ఆయా ప్రాంతాల చుట్టూ పది కిలోమీటర్ల పరిధిలో వస్త్రోత్పత్తి అనుబంధ పరిశ్రమలు విస్తరించాయి. ఇందులో చిన్న, మధ్య తరహా పరిశ్రమలకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల రాయితీలు లభిస్తాయి. ఫలితంగా పరిశ్రమ సామర్థ్యం పెరుగుతుంది. అనుబంధంగా అత్యాధునిక ప్రాసెసింగ్, సైజింగ్, నూలు, డయింగ్, మార్కెటింగ్ కేంద్రం ఏర్పాటుకు అవకాశం ఉంటుంది. జాతీయ అంతర్జాతీయ స్థాయిలో వస్త్రోత్పత్తి రంగంలో వస్తున్న మార్పులకు అనుగుణంగా ఇక్కడి మరమగ్గాలను ఆధునీకరించడం, వీపణిలో నూలు, రసాయనాల ధరలపై స్థానికంగా యజమానులకు, కూలీలకు అవగాహన కల్పించడంలో సిపిసిడిఎస్ ఉపయోగపడుతుంది. రాష్ట్రంలో తొలి టెక్స్‌టైల్ పార్కు సిరిసిల్లలోనే ఉంది. కేంద్రం అనుమతిస్తే ఇందులో ప్రత్యేకంగా స్థలం కేటాయించనున్నారు. దీనికోసం పెద్దూరు సమీపంలోని ఆపెరాల్ పార్క్, గ్రూపు వర్క్ షెడ్ పక్కన అవసరమైన స్థలం ఉంది. వస్త్రోత్పత్తి పరిశ్రమకు సేవలందించిన అన్ని రకాల పరిశ్రమలు ఒకేచోట ఉంటాయి. వేలాది మంది కార్మికులకు ఉపాధి భద్రత ఉంటుంది. రాష్ట్ర ప్రభుత్వం కేంద్ర ప్రభుత్వంతో చర్చించి సిరిసిల్ల నేతన్నలకు శాశ్వత పరిష్కారం చూపాల్సిన అవసరం ఉంది.

అజ్జకొల్లు గ్రామంలో కౌలు రైతుల సర్వే చేస్తున్న నాయకులు

కౌలు రైతులకు రుణార్హత కార్డులు

- తెలంగాణ రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి టి.సాగర్ డిమాండ్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

రాష్ట్రంలో ఉన్న కౌలు రైతులందరికీ రుణార్హత కార్డులు, రైతు భరోసా అందించాలని తెలంగాణ రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి టి.సాగర్ ప్రభుత్వాన్ని కోరారు. వనపర్తి జిల్లా మదనాపురం మండలం అజ్జకొల్లు గ్రామంలో సోమవారం కౌలు రైతుల సర్వే నిర్వహించారు. ఈ సందర్భంగా సాగర్ మాట్లాడుతూ.. రాష్ట్రంలో బ్యాంకుల సర్వే ప్రకారం 24 లక్షల మంది కౌలు రైతులు ఉన్నారని, వారు 35 లక్షల ఎకరాలు సాగు చేస్తున్నారని తెలిపారు. బిఆర్ఎస్ ప్రభుత్వం వచ్చిన కొత్తలో మొదటి 2 సంవత్సరాలు కౌలు రైతులకు "రుణ అర్హత కార్డు" ఇచ్చిందని గుర్తు చేశారు. కానీ, రుణాలు మాత్రం రూ.23 కోట్లకు మించలేదన్నారు. ఆ తరువాత "జాయింట్ లయబిలిటీ" సంఘాలను ఐదుగురు రైతులతో ఏర్పాటు చేశారన్నారు. కౌలు రైతులకు పంట రుణాలు, పంటల బీమా, ప్రభుత్వ పథకాలు (సబ్సిడీ), ప్రకృతి వైపరీత్యాల పరిహారం అందించాలని కోరారు. ఈ కార్డు వల్ల భూ యజమానుల హక్కులకు ఎలాంటి ప్రమాదం లేదన్నారు. లోన్ ఎలిజిబిలిటీ కార్డ్‌పై "ఈ కార్డు ద్వారా భూ యజమానికి వ్యతిరేకంగా కౌలుదారు ఎలాంటి సాక్ష్యంగా వినియోగించరాదు" అనే నిబంధన ఉందన్నారు. అందువల్ల రుణ కార్డుల వల్ల రైతులకు ఎలాంటి నష్టమూ, ప్రమాదమూ లేదన్నారు. అందువల్ల ఈ పథకాలను కౌలు రైతులకు వర్తింపజేయాలని కోరారు. దశాబ్ద కాలంగా కోరుతున్నా బిఆర్ఎస్ ప్రభుత్వం పట్టించుకోలేదన్నారు. పైగా కౌలుదార్లను, వాస్తవ సాగుదార్లను తొలగిస్తూ ధరణిలో చట్ట సవరణ చేసిందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం తన మ్యానిఫెస్టోలో కౌలు రైతులకు సహాయం చేస్తామని పేర్కొందని గుర్తు చేశారు. పంట రుణాలు, పంటల బీమా కూడా వర్తింపజేస్తామని, ప్రస్తుతం అమలులో ఉన్న "అధీకృత లైసెన్స్ రైతుల చట్టం-2011"ను అమలు చేస్తానని ప్రకటించిందని అన్నారు. కౌలుదారుల హక్కులను కాపాడాలని డిమాండ్ చేశారు. నిజాం పాలనలో మొట్టమొదటిసారి 1907లో కౌలుదారులకు హక్కులు కల్పిస్తూ చట్టం చేశారన్నారు. ఆ తర్వాత భారతదేశంలో ఆంగ్లేయ ప్రభుత్వం అనేక రాష్ట్రాల్లో కౌలు చట్టాలను చేసిందన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కౌలు రైతుల సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయకులు వెంకట్ రాములు, విష్ణు, వెంకటేష్, చెన్నయ్య, మణి వర్ధన్, మొగిలి, ఆది పాల్గొన్నారు.

మేడ్చల్‌లో ఘోర రోడ్డు ప్రమాదం.

- విమాన పైలట్ మృతి

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

మేడ్చల్ జిల్లా కీసర పోలీస్ స్టేషన్ పరిధిలోని ఔటర్ రింగ్ రోడ్డుపై కారు అదుపు తప్పడంతో ఓ యవకుడు ఘటనాస్థలంలోనే మృతిచెందాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. సిద్దిపేట జిల్లా గజ్వేల్ పట్టణానికి చెందిన గంగమల్ల రఘువరన్ రెడ్డి కుమారుడు శ్రీకరణ్ రెడ్డి (27).. బ్యాంకాక్‌లో పైలట్‌గా శిక్షణ పొందుతున్నారు. వారం రోజుల క్రితం తన ఇంటికి వచ్చిన ఆయన.. యాదగిరిగుట్టకు వెళ్లి వస్తానని చెప్పి సోమవారం తెల్లవారు జామున ఇంట్లో నుంచి బయలుదేరారు. ఔటర్ రింగ్ రోడ్డుపై అతని కారు అదుపు తప్పడంతో అక్కడికక్కడే మృతిచెందారు. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. ఘటనపై కేసు దర్యాప్తు చేస్తున్నారు. హైదరాబాద్‌లోని గాంధీ ఆస్పత్రిలో పోస్టుమార్టం నిర్వహించిన అనంతరం మృతదేహాన్ని బంధువులు గజ్వేల్‌కు తీసుకొచ్చి సూర్య ఫంక్షన్ హాల్‌లో ఉంచారు. అయితే, రఘువరన్ రెడ్డి ఇద్దరు కూతుర్లు యూఎస్‌లో ఉండగా.. వారు మంగళవారం రాత్రికి గజ్వేల్‌కు చేరుకునే అవకాశం ఉందని.. వారు వచ్చిన తర్వాత బుధవారం శ్రీకరణ్ రెడ్డి అంత్యక్రియలు నిర్వహించనున్నట్టు కుటుంబ సభ్యులు తెలిపారు. కాగా, మెదక్ ఎమ్మెల్సీ డాక్టర్ యాదవ రెడ్డికి రఘువరన్ రెడ్డి స్వయానా బావమరిది. మున్సిపల్ చైర్మన్ రాజమౌళి, వైస్ చైర్మన్ జకీర్, పలువురు కౌన్సిల్ సభ్యులు పట్టణ ప్రముఖులు నివాళులర్పించారు.

రాష్ట్రంలో మారనున్న రాజకీయాలు

- టిడిపి పొలిట్‌బ్యూరో సభ్యులు అరివింద్‌కుమార్‌గౌడ్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

తెలంగాణలో రాజకీయ సమీకరణాలు మారనున్నాయని టిడిపి పొలిట్‌బ్యూరో సభ్యులు అరవింద్‌కుమార్ గౌడ్ వ్యాఖ్యానించారు. తెలుగుదేశం అధినేత, ఎపి సిఎం చంద్రబాబు హైదరాబాద్ రాక నేపథ్యంలో వెల్లువెత్తిన ప్రజాభిమానమే ఇందుకు నిదర్శమని చెప్పారు. సోమవారం నగరంలోని ఎన్‌టిఆర్ భవన్‌లో పార్టీ నాయకులతో కలిసి విలేకర్లతో మాట్లాడారు. నాలుగోసారి ముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకారం చేసిన చంద్రబాబుకు స్వాగతం పలికేందుకు వేలాది మంది హాజరయ్యారని గుర్తు చేశారు. టిడిపి రాజకీయాలే కాకుండా, వివిధ కార్యక్రమాల ద్వారా ప్రజాసేవ సైతం చేస్తుందని గుర్తుచేశారు. ఎన్‌టిఆర్ భవన్ పార్టీ నాయకులు, కార్యకర్తలకు ఒక దేవాలయమని చెప్పారు. ఎపి ప్రజలు విసిగిపోయి జగన్‌ను ఓడించారని అన్నారు. తప్పుడు కేసులతో ప్రజలను మభ్యపెట్టలేరన్నారు. చంద్రబాబు ప్రజల శ్రేయస్సే లక్ష్యంగా రాజకీయాలు చేస్తారని, కక్ష్యలు, కార్పణ్యాలతో కాదన్నారు. చంద్రబాబు దూరదృష్టితోనే ప్రస్తుతం తెలంగాణ, హైదరాబాద్ అన్ని రంగాల్లో ముందుందన్నారు. విలేకర్ల సమావేశంలో రాష్ట్ర పార్టీ ప్రధాన కార్యదర్శి షేక్ ఆరీఫ్, కార్యనిర్వాహక కార్యదర్శి సైదేశ్వర్‌రావు తదితరులు పాల్గొన్నారు.

చదువుకుంటాం.. టీచర్లు కావాలి

- విద్యార్థుల ధర్నా

ధర్నా చేస్తున్న విద్యార్థులు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

"మేము చదువుకుంటాం, మాకు ఉపాధ్యాయులు కావాలి" అంటూ విద్యార్థులు ధర్నా చేసిన సంఘటన సిద్దిపేట జిల్లా జగదేవపూర్ మండలం కేంద్రంలో చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. జగదేవపూర్ మండలం బిజీ వెంకటాపూర్ గ్రామంలోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల విద్యార్థులు తమ తల్లిదండ్రులతో కలిసి మండల వనరుల కేంద్రంలో సోమవారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు, తల్లిదండ్రులతో పాటు ఎంపిటిసి కిరణ్ గౌడ్, సర్పంచ్ మంజుల రమేష్ మాట్లాడారు. పాఠశాలలో 32 మంది విదార్థులు ఉన్నారని, అందులో ఒకే ఉపాధ్యాయుడు విద్యను బోధించడం ఎలా సాధ్యమవుతుందని వాపోయారు. విద్యార్థులు లేని దగ్గర ఉపాధ్యాయులు ఎక్కువ సంఖ్యలో ఉన్నారన్నారు. నాలుగు సంవత్సరాల నుంచి మండల విద్యాధికారికి విన్నవించినా శాశ్వత పరిష్కారం చూపలేదని తెలిపారు. వేరే పాఠశాలల నుంచి తాత్కాలికంగా మాత్రమే ఒక ఉపాధ్యాయుడిని పంపారని, వాళ్లు ఇప్పుడు బదిలీల పేరుతో వెళ్లిపోయారని ఆవేదన వ్యక్తం చేశారు. తాము తమ సొంత డబ్బులతో విద్యా వాలంటీర్‌ను ఏర్పాటు చేసుకున్నామన్నారు. ప్రభుత్వ పాఠశాలను కాపాడుతామని చెబుతున్న ప్రభుత్వం.. తక్షణమే మరో ఇద్దరు ప్రభుత్వ ఉపాధ్యాయులను పంపి న్యాయం చేయాలని కోరారు. ఈ మేరకు మండల వనరుల కేంద్రంలో ఐఆర్‌పి గోవర్ధన్‌కు వినతిపత్రం అందించారు. ఈ కార్యక్రమంలో గ్రామస్తులు, విద్యార్థులు, వారి తల్లిదండ్రులు తదితరులు ఉన్నారు.

ఎసిపి కార్యాలయం ముందు బాధితులు

తిమ్మాపూర్‌లో కొనసాగుతున్న కులవివక్ష

- ఎసిపి, ఆర్‌డిఓలు మూడుసార్లు సందర్శించినా మారని వైనం
- మాదిగల కులవృత్తిని బంద్ చేయించిన అగ్రవర్ణాలు
- ఎసిపి కార్యాలయంలో బాధితుల ఫిర్యాదు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

సిద్దిపేట జిల్లా జగదేవపూర్ మండలం తిమ్మాపూర్ గ్రామంలో కుల వివక్షత ఇంకా కొనసాగుతోంది. ఈ మేరకు సోమవారం కులపెద్దలు, ఎంఆర్‌పిఎస్ నాయకులు ఎసిపి కార్యాలయంలో తమకు న్యాయం చేయాలని కోరుతూ వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా కుల పెద్దలు, ఎంఆర్‌పిఎస్ నాయకులు మాట్లాడుతూ.. గతంలో హనుమాన్ గుడికి వచ్చినా, మంగలి వారు మాదిగలకు చెట్ల కింద కటింగ్ చేసినా ఊరిలో పలుమార్లు ఘర్షణలు జరిగాయని తెలిపారు. ఈ విషయాన్ని దృష్టిలో ఉంచుకొని.. గ్రామంలో జరిగే ఎలాంటి కార్యక్రమానికైనా మాదిగ వాళ్లను డప్పులు కొట్టడానికి రావద్దని అగ్రకులస్తులు ఎస్‌సి, ఎస్‌టి కుల పెద్దలకు హుకుం జారీ చేశారని తెలిపారు. అందులో భాగంగానే ఊరిలో చావులకు, పెళ్లిళ్లకు తమను రానివ్వడంలేదని అన్నారు. ఊరిలో పెద్దమనుషులు అందరం కలిసి ఉందామని చెప్పాల్సింది పోయి, మాదిగలను కులం పేరుతో తిడుతూ అన్ని కులాల్లో ఉన్న యువతను రెచ్చగొడుతున్నారని వాపోయారు. గ్రామంలో ఎలాంటి గొడవలకు దారి తీయకముందే పోలీసులు, అధికారులు చట్టరీత్యా చర్యలు తీసుకోవాలని ఎసిపి కార్యాలయంలో విన్నవించినట్టు తెలిపారు. కాగా, వీరికి ఎమ్మార్‌పిఎస్ నాయకులు మైస రాములు సంపూర్ణ మద్దతు ప్రకటించారు. ఈ కార్యక్రమంలో కులం పెద్దమనిషి పోసాన్ పల్లి కనకయ్య, మైసయ్య, రమేష్, కనకయ్య, కిష్టయ్య, నవీన్, స్వామి, ఉప్పలయ్య, కర్ణాకర్ తదితరులు పాల్గొన్నారు.

సీలింగ్ భూముల్లో నిర్మాణాల కూల్చివేత

- భారీగా మోహరించిన పోలీసులు
- అడ్డుకునేందుకు ప్రయత్నించిన మేయర్, కార్పొరేటర్ల అరెస్ట్
- సామాన్య ప్రజలను బలి చేయడం సరికాదు : సిపిఎం

నిర్మాణాల కూల్చివేతను అడ్డుకుంటున్న ప్రజాప్రతినిధులు, పేదలు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా పీర్జాదిగూడ కార్పొరేషన్ పరిధిలో ఎన్నో ఏండ్లుగా నివాసముంటున్న పేదలు, మధ్యతరగతి వారి నివాసాలను... సీలింగ్ భూమిలో నిర్మాణాలంటూ అధికారులు కూల్చేశారు. సాలార్జంగ్ కంచెలోని సర్వే నెంబరు 1లోని సీలింగ్ భూముల్లో నిర్మాణాలను సోమవారం రెవెన్యూ అధికారులు భారీ పోలీసు బందోబస్తు మధ్య కూల్చేశారు. విషయం తెలుసుకున్న పీర్జాదిగూడ కార్పొరేషన్ మేయర్ జక్క వెంకట్ రెడ్డి, బిఆర్ఎస్ కార్పొరేటర్లు, నాయకులు అక్కడకు చేరుకుని కూల్చివేతలను అడ్డుకునేందుకు ప్రయత్నించారు. దాంతో వారిని పోలిసులు అదుపులోకి తీసుకుని పోలీస్ స్టేషన్‌కు తరలించారు. మేడిపల్లి తహసీల్దార్ హసీనా ఆధ్వర్యంలో చేపట్టిన ఈ కూల్చివేతల కార్యక్రమానికి మేడిపల్లి సిఐ గోవింద్‌రెడ్డి బందోబస్తు ఏర్పాటు చేశారు. అనంతరం తహసీల్దార్ మాట్లాడుతూ.. ప్రభుత్వ భూముల పరిరక్షణకు కబ్జాదారులపై కఠిన చర్యలు ఉంటాయని హెచ్చరించారు. ఇదిలా ఉండగా, కూల్చివేతల విషయం తెలుసుకున్న మల్కాజిగిరి ఎంపి ఈటల రాజేందర్ ఘటన స్థలానికి చేరుకుని పరిశీలించారు. బాధ్యులైన అధికారులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

కక్ష సాధింపు చర్యలు : మేయర్ జక్క వెంకట్ రెడ్డి

సీలింగ్ భూముల్లో నిర్మాణాల కూల్చివేత ముమ్మాటికీ రాజకీయ కక్ష సాధింపు చర్యలేనని పీర్జాదిగూడ మేయర్ జక్క వెంకట్ రెడ్డి ఆరోపించారు. కూల్చివేతల నేపథ్యంలో విలేకరులతో ఆయన మాట్లాడుతూ.. పీర్జాదిగూడ కార్పొరేషన్‌లో బిఆర్ఎస్ పార్టీ మేయర్‌ను దించేందుకు మాజీ ఎమ్మెల్యే మలిపెద్ది సుధీర్‌రెడ్డి అనేక రకాల కుట్రలు చేస్తున్నారని తెలిపారు. అందులో భాగంగానే కొందరు బిఆర్ఎస్ కార్పొరేటర్లను కాంగ్రెస్‌లో చేర్చుకున్నారని, మరికొందరి కోసం ప్రయత్నాలు చేశారని చెప్పారు. కానీ వారు పార్టీ మారకపోవడంతో ఆస్తులకు నష్టం కలిగించేలా భయభ్రాంతులకు గురి చేస్తూ అన్ని రకాల అనుమతులున్న నిర్మాణాలనూ సీలింగ్ ల్యాండ్ పేరుతో కూల్చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కేవలం తనను మేయర్ పదవి నుంచి దించి.. తన అల్లుడు అమర్‌సింగ్‌ను మేయర్‌గా చేయడానికి మాజీ ఎమ్మెల్యే సుధీర్ రెడ్డి అరాచక రాజకీయాలకు పాల్పడుతున్నారని ఆరోపించారు.

సామాన్యులపై రాజకీయాలు వద్దు
సిపిఎం మండల కార్యదర్శి ఎన్.సృజన

పీర్జాదిగూడ కార్పొరేషన్‌లో జరుగుతున్న రాజకీయ పరిణామాల కారణంగా సామాన్య, మధ్య తరగతి ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని సిపిఎం మేడిపల్లి మండల కార్యదర్శి ఎన్.సృజన ఆవేదన వ్యక్తం చేశారు. కూల్చివేతల నేపథ్యంలో ఆమె ఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. సీలింగ్ ల్యాండ్ విషయంలో సంవత్సరాల తరబడి హద్దులు నిర్ధారించడంలో రెవెన్యూ అధికార యంత్రాంగం విఫలమైందన్నారు. ఇక్కడ నిర్మాణ అనుమతులు మంజూరు చేసే సమయంలో విచారణ చేపట్టిన రెవెన్యూ, మున్సిపల్ టౌన్ ప్లానింగ్ అధికారులకు అది సీలింగ్ భూమి అని తెలియదా? అని ప్రశ్నించారు. నాలుగేండ్ల కిందట సీలింగ్ భూమి అంటూ తేనె తెట్టెను కదిలించిన అప్పటి అధికార పార్టీకి చెందిన కొందరు.. ప్రజలను భయభ్రాంతులకు గురి చేసి లక్షల రూపాయలు వసూళ్లు చేశారని ఆరోపించారు. ఇప్పుడు అధికార మార్పిడి కావడంతో ప్రస్తుత అధికార పార్టీ నేతలు కూడా అదే ధోరణిలో కూల్చివేతల కార్యక్రమం చేపడుతున్నారని తెలిపారు. ఏదేమైనా స్వార్థ రాజకీయాల కారణంగా పేద, మధ్య తరగతి ప్రజలు బలిపశువులుగా మరుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.

ఎన్‌హెచ్‌ఎం పథకాన్ని ప్రయివేటీకరించొద్దు

- ఆశాల సమస్యల పరిష్కారానికి డిమాండ్ల డేలో పాల్గొంటాం
- వైద్యారోగ్య కమిషనర్‌కు సిఐటియు వినతి

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

నేషనల్ హెల్త్ మిషన్ (ఎన్‌హెచ్‌ఎం) పథకానికి బడ్జెట్ పెంచాలనీ, దాన్ని ప్రయివేటీకరించొద్దని తెలంగాణ ఆశా వర్కర్స్ యూనియన్ (సిఐటియు అనుబంధం) రాష్ట్ర అధ్యక్షులు పి జయలక్ష్మి, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆర్ నీలాదేవి, కోశాధికారి పి గంగమణి, కార్యనిర్వాహక అధ్యక్షులు కాసు మాధవి కోరారు. ఆశాల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ ఈ నెల పదో తేదీన తలపెట్టిన డిమాండ్ల డేలో ఆశాలందరూ పాల్గొంటారని ప్రకటించారు. ఈ మేరకు సోమవారం హైదరాబాద్‌లో వైద్యారోగ్య కమిషనర్ ఆర్.వి. కర్ణన్‌కు వినతిపత్రాన్ని అందజేశారు. ఆశాలకు నష్టం చేకూర్చే పరీక్షను కేంద్ర ప్రభుత్వం వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. కేంద్రం నిర్ణయాన్ని రాష్ట్ర సర్కారు అమలు చేయవద్దని కోరారు. 45వ ఐఎల్‌సి సిఫారసులను అమలు చేయాలని, ఆశాలను కార్మికులుగా గుర్తించి కనీస వేతనం రూ.26 వేలు, పిఎఫ్, ఇఎస్‌ఐ, తదితర చట్టబద్ధ సౌకర్యాలు కల్పించాలని విన్నవించారు. ప్రతి నెలా పదివేల రూపాయల పెన్షన్ సౌకర్యాన్ని కల్పించాలని విజ్ఞప్తి చేశారు. దేశ్యాప్తంగా ఆశాలకు, స్కీమ్ వర్కర్లకు పే కమిషన్ ఏర్పాటు చేయాలని విన్నవించారు. కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం తీసుకొచ్చిన నాలుగు లేబర్ కోడ్‌లను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వ రంగ సంస్థల ప్రయివేటీకరణను ఆపాలని, నేషనల్ మానిటైజేషన్ పైపులైన్‌ను రద్దు చేయాలని కోరారు.

BOI
Relationship beyond banking

11న మొండి బాకీల పరిష్కారం

- బ్యాంక్ ఆఫ్ ఇండియా వెల్లడి

హైదరాబాద్ : మొండి బాకీల పరిష్కారానికి తమ రుణగ్రహీతలకు ప్రత్యేక అవకాశం కల్పిస్తోన్నట్లు బ్యాంక్ ఆఫ్ ఇండియా (బిఒఐ) తెలిపింది. దేశ వ్యాప్తంగా జులై 11న వన్ టైమ్ సెటిల్మెంట్ (ఓటిఎస్) కింద మొండి బాకీల రుణ ఖాతాలను పరిష్కరించడానికి ప్రత్యేక క్యాంపెయిన్ చేపడుతున్నామని ఆ బ్యాంక్ తెలంగాణ జోన్ డిప్యూటీ జనరల్ మేనేజర్ (రికవరీ) ఓ ప్రకటనలో వెల్లడించారు. తమ అన్ని శాఖలు, జోన్లు, ఎఫ్‌జిఎంఒలో సంఘౌత దినోత్సవంలో భాగంగా ఏదైనా నిజమైన కారణం వల్ల సకాలంలో రుణాన్ని తిరిగి చెల్లించలేని రుణగ్రహీతల కోసం దీన్ని ప్రత్యేకంగా ఏర్పాటు చేస్తున్నామన్నారు. చిన్న, మధ్యస్థ ఖాతాల పరిష్కారం కోసం తమ బ్యాంక్ ఒటిఎస్‌ను కల్పిస్తుందన్నారు. దీని ద్వారా ప్రత్యేక డిస్కౌంట్లను అందిస్తున్నామన్నారు. ఈ సువర్ణావకాశాన్ని వినియోగించు కోవాలని ఆ బ్యాంక్ విజ్ఞప్తి చేసింది.

'గురుకులం' బిల్డింగ్ పైనుంచి జారి విద్యార్థినికి గాయాలు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

గురుకుల పాఠశాల బిల్డింగ్ రెండో అంతస్తుపై నుంచి ఓ విద్యార్థిని ప్రమాదవశాత్తు కిందపడింది. ఈ ప్రమాదంలో ఆమె వెన్నుముక, కాలుకు తీవ్ర గాయాలయ్యాయి. ఈ ఘటన సంగారెడ్డి జిల్లా రాయికోడ్ మండలం అల్లాపూర్ గ్రామ శివారులోని తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలలో సోమవారం జరిగింది. బాధిత విద్యార్థిని కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. రాయికోడ్ మండలం యూసూపర్ గ్రామానికి చెందిన మల్లేశ్వరి అల్లాపూర్ గ్రామ శివారులోని తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలలో పదో తరగతి చదువుతోంది. అయితే సోమవారం ఆరో తరగతి చదువుతున్న ఓ విద్యార్థిని రెండో అంతస్తులోని తన రూమ్‌లోని పెట్టెలో డబ్బులున్నాయి.. తీసుకురావడానికి తోడుగా రమ్మని మల్లేశ్వరిని అడిగింది. దాంతో వారిద్దరూ కలిసి రెండో అంతస్తు పైకి వెళ్లారు. డబ్బులు తీసుకోవడానికి ఆ అమ్మాయి రూమ్‌లోకి వెళ్లగా.. మల్లేశ్వరి మాత్రం ప్రహరీ గోడ పక్కన బకెట్‌పై నిల్చొని బయటకు చూస్తోంది. ఈ క్రమంలో అక్కడినుంచి ప్రమాదవశాత్తు కిందపడింది. అయితే ఎవరో గుర్తు తెలియని వారు తనను కిందికి తోసేసినట్టు బాధిత విద్యార్థిని చెబుతోంది. కాగా విషయం తెలుసుకున్న ప్రిన్సిపల్, ఉపాధ్యాయులు హుటాహుటిన విద్యార్థినిని జహీరాబాద్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. అనంతరం సంగారెడ్డిలోని బాలాజీ ఆస్పత్రిలో చేర్చి చికిత్స అందిస్తున్నారు. ఈ ప్రమాదంలో ఆ విద్యార్థి వెన్నుముకకు, కాలుకు తీవ్ర గాయాలయినట్టు తెలుస్తోంది.

మా గోస మీకు పట్టదా?

- 'ప్రజావాణి'లో మాజీ సర్పంచి భర్త ఆత్మహత్యాయత్నం
- చేతి రుమాలుతో మెడకు బిగించుకునే యత్నం
- అడ్డుకున్న పోలీసులు
- ఆందోళనకు దిగిన మాజీ సర్పంచులు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

'అభివృద్ధి పనులను తొందరగా చేయాలని తమపై ఒత్తిడి చేసిన అధికారులు ఇప్పుడు ఆ పనులకు సంబంధించి బిల్లులు ఇవ్వకుండా ముప్పుతిప్పలు పెడతారా? మండల స్థాయి మొదలు జిల్లా అధికారుల కార్యాలయాల చుట్టూ తిరిగినా బిల్లులు మంజూరు చేయకపోగా.. ఇప్పుడు మా పదవీ ముగియడంతో కనీసం పట్టించుకోవడం లేదు. లక్షలు అప్పులు చేసి వడ్డీలు కట్టలేక అవస్థలు పడుతున్నాం. మా గోస మీకు పట్టదా?' అంటూ కరీంనగర్ కలెక్టరేట్‌లో సోమవారం ప్రజావాణి కార్యక్రమంలో ఓ మాజీ సర్పంచ్ భర్త తన మెడకు చేతిరుమాలు బిగించుకుని ఆత్మహత్యాయత్నం చేయబోయాడు. అక్కడే ఉన్న కలెక్టర్ సహా పోలీసులు అడ్డుకుని ఆయనను బయటకు నెట్టేశారు. దీంతో అక్కడే ఉన్న మరికొంత మంది మాజీ సర్పంచులు ఆందోళనకు దిగారు. రామడుగు మేజర్ గ్రామ పంచాయతీ మాజీ సర్పంచ్ పంజాల ప్రమీల భర్త జగన్‌గౌడ్ తమకు రావాల్సిన పెండింగ్ బిల్లుల విషయమై కలెక్టర్‌కు వినతిపత్రం ఇచ్చేందుకు ప్రజావాణికి వచ్చారు. కలెక్టర్ పమేలా సత్పతితో తాము గ్రామంలో చేసిన అభివృద్ధి పనులకు సంబంధించిన బిల్లుల్లో ఒక్క రూపాయి కూడా రాలేద ని చెప్పాడు. పనులు చేసే వరకూ అధికారులు ఒత్తిడి చేశారని, బయట అప్పులు తెచ్చి పూర్తి చేశామని, అవి వడ్డీల మీద వడ్డీలు పడుతున్నాయని చెప్పుకొచ్చాడు. 'మన ఊరు - మన బడి' కింద పాఠశాల మరమ్మతు, ఆధునీకరణ పనులకు మేనేజ్‌మెంట్ కమిటీ ముందుకు రాకపోవడంతో తానే పూర్తి చేశానని తెలిపాడు. ఇవేగాకుండా గ్రామంలో మరికొన్ని పనులు చేశానన్నాడు. రూ.లక్షల్లో రావాల్సిన బిల్లులకు ఎమ్‌బీ రికార్డులూ పూర్తయినా ఇప్పటికీ విడుదల చేయడం లేదని ఆవేదన వ్యక్తం చేశాడు. అప్పటికే ఆవేశంతో ఉన్న జగన్‌గౌడ్ 'నేను చెప్పులు అరిగేలా కార్యాలయాల చుట్టూ తిరిగినా.. ఇప్పుడు మా పదవీకాలం ముగిసిందని ఎవరూ పట్టించుకోవడం లేదు. మీరు బిల్లులు ఇవ్వకుంటే చావే శరణ్యం' అంటూ చేతి రుమాలతో మెడకు బిగించుకున్నాడు. గమనించిన పోలీసులు ఆ రుమాలు లాక్కుని అతన్ని బయటకు లాక్కెళ్లారు. అక్కడే ఉన్న రామగుడు, గంగాధర మండలాల మాజీ సర్పంచులు బిల్లుల విషయమై ఆందోళనకు దిగారు. వారిని సముదాయించిన పోలీసులు ప్రజావాణి నుంచి బయటకు పంపించారు.